సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం । 23 । డిసెంబర్ । 2023



స్తంభించిన ట్రాఫిక్

భూత్పూర్ సమీపంలో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

వివరాలు 8లో ▸



వ్యవసాయానికి ప్రాధాన్యం

వ్యవసాయరంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రొ. హరగోపాల్ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.4 /13.2

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో **రోడ్డు ప్రమాదాల** నివారణకు పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, వాహనాల తనిఖీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడే వారి వాహనాలను సీజ్ చేయడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేసే వారిని గుర్తించి చలానాలు వేస్తామని తెలిపారు. అతివేగాన్ని అదుపు చేయడం కోసం కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ప్రాంతాలలో స్పీడ్ గన్‌లను ఏర్పాటు చేస్తామని, నంబర్ ప్లేట్ లేని వాహనాలు, సగం నంబర్ ఉన్న వాహనాలను గుర్తించి, సీజ్ చేస్తామన్నారు. జిల్లాలో బ్లాక్ స్పాట్‌లు, ప్రమాద స్థలాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి



వంగూరు: సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని.. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ చాంబర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చంపేటలోని ప్రజాభవన్‌లో ప్రతి వారం ప్రజావాణి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా హలో అచ్చంపేట పేరుతో గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం తుమ్మలపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఎన్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పండిత్‌రావు, అల్వాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రమేష్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మాస్టర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపిక

అచ్చంపేట రూరల్: తెలంగాణ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే నాగర్‌కర్నూల్ జిల్లా జట్టును ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్మ శ్రీనుయాదవ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 30, 31 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్న పోటీలలో 35 ఏళ్ల పైబడిన క్రీడాకారుల నుంచి 90ఏళ్ల వయసు గల వెటరన్ క్రీడాకారులు పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. స్త్రీ, పురుషుల విభాగాలలో ఎంపికలు ఉంటాయని, పోటీలలో పాల్గొనే క్రీడాకారులు వయసు ధ్రువపత్రాలతో ఆదివారం ఉదయం 9గంటలకు హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 100 మీ., 200 మీ., 400 మీ., 800 మీ., 1500 మీ., 5000 మీ., 10,000 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, హ్యామర్ త్రో, వాకింగ్‌లో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు లీగల్ అడ్వైజర్ కర్నాటి శ్రీనివాసులు 9912007708, 9182476069 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

జనవరి 18నుంచి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

కందనూలు: జనవరి 18, 19, 20 తేదీల్లో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు డీఈఓ గోవిందరాజులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎస్‌సీఆర్టీ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈనెలాఖరున నిర్వహించాల్సిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గమనించాలని, జనవరిలో నిర్వహించనున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు సిద్ధం కావాలని కోరారు.

ప్రైవేటు జోరు!

జిల్లాలో మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు



మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన ధాన్యాన్ని తూకం వేస్తున్న సిబ్బంది

- లక్ష్యం లక్ష మెట్రిక్ టన్నులు.. సేకరించింది 26,991 మెట్రిక్ టన్నులు
- ప్రైవేటుకే మొగ్గు చూపుతున్న రైతులు
- క్వింటాకు రూ.3వేలకు పైగా పలుకుతున్న ధర

నాగర్‌కర్నూల్: వానాకాలంలో పండించిన ధాన్యాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలపై రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కంటే ప్రైవేటులో ధాన్యానికి అధికంగా ధర వస్తుండటం.. కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో కోత విధిస్తుండటంతో రైతులు ప్రైవేటు వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మందకొడిగా సాగుతున్నాయి.

ప్రైవేటులోనే ధర అధికం..

ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,080 ఉండగా.. కేంద్ర ప్రభుత్వం ఈ ధరను రూ.2,203గా నిర్ణయించింది. కాగా బహిరంగ మార్కెట్‌లో క్వింటాకు రూ.3వేల నుంచి రూ.3,300 వరకు ధర పలుకుతుండటంతో రైతులు కొనుగోలు కేంద్రాలపై ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు సెంబ్లీ ఎన్నికల నిర్వహణలో అధికారులు ఉండటంతో ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు పెద్ద మొత్తంలో ధాన్యం విక్రయించినట్లు తెలుస్తోంది.

ప్రైవేటులోనే ఎక్కువ ధర ఇస్తుండ్రు..



ప్రభుత్వం ఏర్పాటు చేసిన **కొనుగోలు కేంద్రా**ల కంటే **ప్రైవేటులోనే** ధాన్యానికి **ఎక్కువ ధర** ఇస్తుండ్రు. **క్వింటాకు** రూ.3,250 చొప్పున 60 క్వింటాళ్ల ధాన్యాన్ని కొన్నారు. అది కూడా ఇంటి వద్దకు వచ్చి కాంటా చేసుకుని వెళ్లారు, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు కూడా మిగిలింది.

– చిన్నమశన్న, రైతు, రాయిపాకుల, తెలకపల్లి మండలం

వచ్చేనెల వరకు ధాన్యం సేకరణ..

వానాకాలం పంట సేకరణకు ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు వచ్చేనెల వరకు కొనసాగుతాయి. ప్రభుత్వం ఇచ్చే ధర కంటే ప్రైవేటులో అధికంగా ఉండటంతో రైతులు అక్కడికే మొగ్గు చూపుతున్నారన్న మాట వాస్తవం. దొడ్డు రకం ధాన్యం మాత్రం రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నారు.

– బాల్‌రాజు, సివిల్ సప్లయ్ డీఎం, నాగర్‌కర్నూల్

26,991 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

జిల్లావ్యాప్తంగా వానాకాలంలో రికార్డు స్థాయిలో వరిపంటను సాగుచేశారు. దాదాపు 1,14,099 ఎకరాల్లో పంటసాగు చేయగా.. 3.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే కొనుగోలు కేంద్రాల ద్వారా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 192 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం 161 కేంద్రాల్లో మాత్రమే ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 26,991 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు అధికారుల సమాచారం. ప్రైవేటు జోరుతో కొనుగోలు కేంద్రాలకు ఆశించిన స్థాయిలో ధాన్యం రావడంలేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి : కలెక్టర్

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం, పత్తి కొనుగోలు చేపట్టాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లి శ్రీకృష్ణ పత్తి మిల్లు, నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా పత్తిమిల్లులో కొనుగోలు ప్రక్రియపై రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మిల్లుకు వచ్చిన పత్తిని, ప్రాసెసింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పత్తి రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా మార్కెటింగ్ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పత్తి విక్రయించే రైతుల బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింకేజీ ఉండేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు అన్ని వసతులు కల్పించాలని తెలిపారు. జిల్లాలో 2023 – 24 సంవత్సరం జిల్లాలో పత్తి దిగుబడులను అంచనావేసి మద్దతు ధర రూ.7,020గా నిర్ణయించినట్లు చెప్పారు. మొత్తం 16 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని.. ఇప్పటి వరకు 501 మంది రైతుల నుంచి 18224.17 మెట్రిక్ టన్నుల పత్తిని సేకరించినట్లు వివరించారు. రూ.67.51లక్షలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అనంతరం నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. సహకార సంఘం ఆధ్వర్యంలో 176, ఐకేపీ ఆధ్వర్యంలో 24 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 4,063 మంది రైతులతో 26,991 మెట్రిక్ టన్నుల ధానాన్ని కొనుగోలు చేశామని.. రూ.15 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కాగా ధాన్యం, పత్తి విక్రయించే రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు లేనట్లయితే వ్యవసాయాధికారుల ధ్రువపత్రాలను పరిగణలోకి తీసుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.

రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించండి

- కలెక్టర్ ఉదయ్‌కుమార్



రెవెన్యూ అధికారులతో వీసీ నిర్వహిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశించారు. రెవెన్యూ యంత్రాంగం మొత్తం ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ధరణి రిజిస్ట్రేషన్లు, భూసేకరణ, రెవెన్యూ సమస్యలు తదితర అంశాలపై శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఆయా మండలాల రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి టీఎం–33 పెండింగ్ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. భూముల సర్వేకు వచ్చిన దరఖాస్తులపై సర్వే, విచారణ త్వరగా పూర్తిచేసి అర్హులకు పట్టాలను జారీ చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. మీసేవ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని, చెక్కులు సిద్ధంగా ఉన్నచోట వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. ధరణి సమస్యలపై తహసీల్దార్లకు వచ్చే ఫిర్యాదులను పరిష్కరించకుండా కలెక్టరేట్‌కు పంపించడంపై అసహనం వ్యక్తం చేశారు. నేటి వరకు 1000 ధరణి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండగా.. తాను పరిష్కరించాల్సినవి 500 దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. తహసీల్దార్ల వద్ద దరఖాస్తుల పెండింగ్ అధికంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీస్ ఉద్యోగాల దరఖాస్తులో భాగంగా స్థానికత, కుల, ఆదాయ ఇతరాత్ర ధ్రువపత్రాల జారీలో అలసత్వం ప్రదర్శించరాదని తెలిపారు. అంతకుముందు ధరణి ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆన్‌లైన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు.

పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

రాబోవు పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని వంశీ కన్వెన్షన్ గార్డెన్స్‌లో అధికారులతో గెట్ టుగెదర్ నిర్వహించి, అసెంబ్లీ ఎన్నికల విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో శాసనసభ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా కృషి చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వాటి నుంచి నవంబర్ 30న పోలింగ్, ఈనెల 3న కౌంటింగ్ ప్రక్రియలో అధికారుల భాగస్వామ్యం మరువలేనిదని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన రిటర్నింగ్ అధికారులు ఇతర సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా జిల్లా యంత్రాంగం, ప్రజలకు అనుసంధానంగా వ్యవహరిస్తూ.. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన పాత్రికేయులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, అదనపు కలెక్టర్‌లు కుమార్ దీపక్, సీతారామారావు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, ఆర్డీఓ రాంరెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడీ బాలమణి, సీపీఓ అధికారి ఫిరోజ్, డీసీఓ పత్యానాయక్, డీఎస్‌ఓ స్వామికుమార్, సివిల్ సప్లై డీఎం బాలరాజ్, ఈడీఎం నరేష్, ధరణి ఆపరేటర్ సంపత్‌కుమార్‌రెడ్డి, కలెక్టరేట్ ఈ విభాగం సూపరింటెండెంట్ కార్తీక్‌కుమార్, డీటీ బాలరాజ్, ఎన్‌ఐసీ మేనేజర్ హర్షత్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ జాకీర్‌అలీ, రఘు, కలెక్టర్ సీసీ ఖాజా మైనుద్దీన్ ఉన్నారు.

లక్కీ చాన్స్!

- పెండింగ్ చలాన్లపై భారీ రాయితీ
- ఈనెల 26 నుంచి స్పెషల్ డ్రైవ్
- జిల్లా వ్యాప్తంగా 1,64,202 పెండింగ్ చలాన్లు



నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులకు పోలీసులు విధించిన ఈ–చలాన్ వసూలుకు సంబంధించి పోలీస్‌శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ద్విచక్ర వాహనం నుంచి భారీ వాహనం వరకు పెండింగ్‌లో ఉన్న చలాన్స్ చెల్లించడానికి ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా భారీ స్థాయిలో రాయితీలు ప్రకటించింది. ద్విచక్ర వాహనాలకు 80 శాతం, ఆటోలు, కార్లు ఇతర ఫోర్ వీలర్స్‌కు 60 శాతం, లారీలు, ట్రాన్స్‌పోర్టు వాహనాలకు 50 శాతం, ఆర్టీసీ బస్సులకు 90 శాతం రాయితీ ప్రకటించారు. దీంతో చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఈ–చలాన్లు చెల్లించేందుకు వాహనదారులకు ఊరట లభించినట్లయ్యింది. జిల్లాలోని 22 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 1,64,202 చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రత్యేక డ్రైవ్‌తో పెండింగ్ చలాన్లు పెద్దఎత్తున వసూలయ్యే ఆస్కారం ఉంది. ఇందుకోసం ఈనెల 26 నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. గతేడాది పెండింగ్ చలాన్లు వసూలు చేసేందుకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించడంతో వాహనదారుల నుంచి విశేష స్పందన లభించింది.



జిల్లా కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

ఏడాది	పెండింగ్ చలాన్లు
2023	45,379
2022	64,334
2021	54,489

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పెండింగ్ ఈ–చలాన్లు కట్టేందుకు కల్పించిన రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి. పెండింగ్ చలాన్ లేకుండా ప్రతి వాహనదారుడు జాగ్రత్తలు తీసుకోవాలి. మోటారు వాహన చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారికి విధించిన చలాన్లు తప్పనిసరిగా చెల్లించాలి. ఇందుకోసం ఈనెల 26నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం.

– గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ, నాగర్‌కర్నూల్

క్రిస్మస్ కానుకల పంపిణీ




క్రిస్మస్ కానుకలు పంపిణీ చేస్తున్న అధికారులు

కందనూలు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలో మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారిణి రాజేశ్వరి, ఆర్డీఓ రాంరెడ్డి క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సర్వ మతాలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మతపెద్దలు పాల్‌రాజ్, క్రిస్టఫర్, నాయకులు విజయ్‌కుమార్, శామ్యూల్, కావలి శ్రీను పాల్గొన్నారు.

పబ్బతి హనుమా పాహిమాం

- ప్రారంభమైన మద్దిమడుగు అంజన్న ఉత్సవాలు



యాగశాల ప్రవేశం నిర్వహిస్తున్న వేదపండితులు

అమ్రాబాద్: పదర మండలంలోని మద్దిమడుగులో పబ్బతి ఆంజనేయస్వామి దీక్ష విరమణ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పండితులు వీరయ్యశాస్త్రి, వీరయ్యశర్మల బృందం వేద మంత్రోచ్ఛరణల మధ్య ఉత్సవాలను ఆలయ కార్యనిర్వహణాధికారి రంగాచారి ప్రారంభించారు. మొదటి రోజు నిత్యార్చన విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, ఉష్ణవాహన సేవ, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దీక్ష చేపట్టిన భక్తులు మద్దిమడుగు క్షేత్రానికి చేరుకుంటున్నారు. పదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అమ్రాబాద్ సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ తిరుపతిరెడ్డిల పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజమ్మ, ఆలయ అధికారులు జైపాల్ రెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

చెంచు పెంటల్లో పాఠశాలల ఏర్పాటు



అప్పాపూర్‌లో చెంచు విద్యార్థులతో విద్యాధికారులు

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న చెంచు పెంటలలో పాఠశాలల ఏర్పాటుకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పీఎం జన్మన్ అమలులో భాగంగా సెక్టోరియల్ అధికారులు నూరుద్దీన్, షర్ఫుద్దీన్, ఎంఈఓ చంద్రుడు శుక్రవారం అప్పాపూర్ గ్రామ పంచాయతీలోని అనేక చెంచు పెంటలను సందర్శించారు. ఆదివాసీ జనాభా ఉన్న పెంటలలో పాఠశాలల ఏర్పాటు, 6నుంచి 14 సంవత్సరాల పిల్లలను గుర్తించినట్లు వారు తెలిపారు. చెంచు పెంటలలో బడీడు పిల్లలు పాఠశాలలకు వెళ్లే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఉత్సాహంగా యువజనోత్సవాలు



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్స్‌లో శుక్రవారం జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో జిల్లాలోని యువ కళాకారులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. జానపద నృత్యం, కథారచన, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫి పోటీల్లో పలువురు అత్యుత్తమ ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

రాష్ట్రస్థాయికి ఎంపికైన కళాకారులు..

జానపద నృత్యం సామూహిక విభాగంలో పల్లవి గ్రూప్, వ్యక్తిగత విభాగంలో అభినయశ్రీ, జానపద పాటలు సామూహం విభాగంలో మమత గ్రూప్, వ్యక్తిగత విభాగంలో పరుశరాములు (పెద్దకొత్తపల్లి), కథారచనలో నందిని (జెడ్పీహెచ్‌ఎస్ తాడూర్), పోస్టర్ మేకింగ్‌లో రహీం (ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాగర్‌కర్నూల్), ప్రకటన విభాగంలో నందిని (జెడ్పీహెచ్‌ఎస్ తాడూర్), ఫొటోగ్రఫిలో మణికంఠ (తాడూర్), యువకృతి విభాగంలో మహేష్ (తాడూర్) ఎంపికయ్యారు. కార్యక్రమంలో డీఆర్డీఓ నర్సింగరావు, డీఈఓ గోవిందరాజులు, ఇంటర్ నోడల్ అధికారి వెంకటరమణ, డీవైఎస్‌ఓ సీతారాం తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కందనూలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జెడ్పీ సీఈఓ ఉష, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాంలాల్ సూచించారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సాంఘిక సంక్షేమ వసతిగృహాల బాలబాలికలకు జిల్లా స్థాయి ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. పాఠశాల స్థాయిలోనే బాలబాలికలు క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి శ్రీధర్, సూపరింటెండెంట్ రాంజీ, తిమ్మాజిపేట ఎంపీడీఓ కరుణశ్రీ పాల్గొన్నారు.

పోటీల విజేతలు వీరే..

కబడ్డీ బాలుర విభాగంలో కొల్లాపూర్ మొదటి, కల్వకుర్తి ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో అచ్చంపేట మొదటి, కల్వకుర్తి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. వాలీబాల్ బాలుర విభాగంలో అచ్చంపేట మొదటి, నాగర్‌కర్నూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఖోఖో బాలికల విభాగంలో నాగర్‌కర్నూల్ మొదటి, అచ్చంపేట ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలుర పరుగుపందెంలో విశ్వవిరాట్ (నాగర్‌కర్నూల్) మొదటి, గణేష్ (బిజినేపల్లి) ద్వితీయ, ఎస్.పవన్ (బిజినేపల్లి) తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. బాలికల పరుగుపందెంలో ఎం.నందిని మొదటి, ఆర్.ఇందు ద్వితీయ, బి.మీనా (నాగర్‌కర్నూల్) తృతీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలుర జట్లు

క్లుప్తంగా

వరికోత యంత్రం కింద పడి వ్యక్తి మృతి



చిన్నంబావి: వరికోత యంత్రం కింద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని వెలగొండలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరంగాపూర్ మండలంలోని జానంపేటకి చెందిన నరేష్(26) వరి పంటను కోత కోసేందుకు మండలంలోని వెలగొండకి వచ్చాడు. వరి కోత యంత్రం చెడిపోవడంతో దానిని మరమ్మతు చేసేందుకు యంత్రం కిందికి దిగిడు. మరమ్మతు చేస్తున్న క్రమంలో యంత్రం పైభాగం మీద పడి యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై స్థానిక ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డిని వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని, తమ దృష్టికి వచ్చిందని, పూర్తి స్థాయిలో విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

బస్సులో నుంచి కిందపడి వ్యక్తి దుర్మరణం



అంజయ్య (ఫైల్)

చారకొండ: బస్సులో నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మర్రిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవి కథనం మేరకు.. మర్రిపల్లికి చెందిన గండికోట అంజయ్య (55) గురువారం వ్యక్తిగత పని నిమిత్తం దేవరకొండకు వెళ్లి రాత్రి గ్రామానికి చేరుకొని నడుస్తున్న బస్సులో నుంచి దిగే ప్రయత్నం చేసి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామస్తులు వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. శుక్రవారం అంజయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు..



చంద్రయ్యగౌడ్ (ఫైల్)

కల్వకుర్తి రూరల్: కల్వకుర్తి మండలంలోని ఎల్లికట్టకు చెందిన గీత కార్మికుడు చంద్రయ్యగౌడ్ (60) శుక్రవారం తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. కులవృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్న చంద్రయ్యగౌడ్.. రోజు మాదిరిగానే కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. కల్లు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని కుటుంబ సభ్యులు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీనయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రమేష్ యాదవ్ తెలిపారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

మల్దకల్: అనారోగ్యం ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతిచెందాడు. ఈ సంఘటన మల్దకల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్దకల్‌కి చెందిన వడ్ల మోనాచారి(31) కొంత కాలంగా అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రాధమ్మ, ఓ కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

బంధువుల ఇంటికి వెళ్లొద్దనందుకు వ్యక్తి బలవన్మరణం



సూర్యనారాయణ (ఫైల్)

నవాబుపేట: బంధువుల ఇంట్లో జరిగే పూజకు వెళ్లొద్దని భార్య చెప్పడంపై క్షణికావేశానికి గురైన భర్త పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని కామారంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కామారం గ్రామానికి చెందిన సూర్యనారాయణ (36) ఈనెల 18న తమ బంధువుల ఇంట్లో పూజకు వెళ్దామని తన భార్య నాగమణికి చెప్పగా.. ఆమె ఒప్పుకోలేదు. మరుసటి రోజు వెళ్దామని చెప్పడంతో క్షణికావేశానికి గురైన సూర్యనారాయణ.. ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

మానవత్వంతో వెళితే..
మృత్యుఒడిలోకి..

- ఒకరిని కాపాడేందుకు వెళ్లి మరొకరు మృతి
- రెండు కుటుంబాల్లో విషాదం నింపిన రోడ్డు ప్రమాదం



అశోక్ (ఫైల్)



నవాజ్ (ఫైల్)

కల్వకుర్తి టౌన్: మానవత్వమే అతడి పాలిట మృత్యువైంది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న యువకుడితో పాటు అతడిని కాపాడేందుకు వెళ్లిన మరో వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో దుర్మరణం చెందారు. రోడ్డు ప్రమాదం ఇద్దరి జీవితాలను ఛిద్రం చేయడమే గాక.. వారి కుటుంబసభ్యుల ఆశలను సమాధి చేసింది. ఈ విషాదకర ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షి నర్సింహులు, ఎస్‌ఐ రమేష్ వివరాల మేరకు.. కల్వకుర్తి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన నవాజ్ (25) టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి 11 నెలల కిందట వివాహం కాగా.. 10 రోజుల క్రితం కూతురు జన్మించింది. తన కుమార్తెను చూసేందుకు గురువారం మధ్యాహ్నం బైక్‌పై తన అత్తగారి ఊరైన జడ్చర్ల పట్టణానికి వెళ్లాడు. అక్కడి నుంచి రాత్రి కల్వకుర్తికి బయల్దేరగా.. మండలంలోని మార్చాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో హాలియా నుంచి కొత్తకోట మండలం కనిమెట్టకు వెళ్తున్న ఓ కంపెనీ పాల వ్యాన్ హెల్పర్ అశోక్ (30) ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న నవాజ్‌ను గమనించి కాపాడే ప్రయత్నం చేస్తుండగా.. కల్వకుర్తి వైపు వేగంగా వెళ్తున్న మరో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో నవాజ్‌తో పాటు అశోక్‌కు తీవ్రగాయాలై దుర్మరణం చెందారు. అశోక్‌ది వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామం. పాల వ్యాన్ డ్రైవర్ నర్సింహులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరి మృతదేహాలను కల్వకుర్తి మార్చురీకి తరలించారు. కాగా.. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద ఇరువురి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. పాలవ్యాన్ డ్రైవర్ నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

కనిమెట్టలో విషాదఛాయలు

కొత్తకోట రూరల్: కొత్తకోట మండలంలోని కనిమెట్టకు చెందిన చీర్ల నాగమ్మ, వెంకటయ్య దంపతుల కుమారుడు అశోక్ కొంత కాలంగా గ్రామ సమీపంలోని ఓ డెయిరీ మిల్క్ ఫ్యాక్టరీకి చెందిన లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కల్వకుర్తి మండలం మార్చాల వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో అశోక్ దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



శేరిపల్లి(బి) వద్ద జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

భూత్పూర్: ఎల్‌అండ్‌టీ కంపెనీ వారు జాతీయ రహదారిపై బీటీ పనులు కొన్నిరోజులుగా చేపడుతున్నారు. శుక్రవారం భూత్పూర్ సమీపంలోని శేరిపల్లి (బి) నుంచి జడ్చర్ల వైపు బీటీ పనులు చేపడుతుండటంతో వాహనాలను దివిటిపల్లి నుంచి భూత్పూర్ వైపు వచ్చే రహదారిపైకి దారి మళ్లించారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి రాత్రివేళ రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దివిటిపల్లి వద్ద రైల్వే డబ్లింగ్ పనులు చేపట్టడంతో వంతెన నిర్మాణం రెండేళ్లుగా నత్తనడకన సాగుతుండటంతో శని, ఆదివారాల్లో హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు సైతం రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఎన్‌హెచ్ అధికారులు చొరవ తీసుకొని దివిటిపల్లి వద్ద వంతెన నిర్మాణం త్వరగా పూర్తిచేసి రాకపోకల ఇబ్బందులు తొలగించాలని, బీటీ పనులు సాయంత్రం వరకు చేపట్టి యధావిధిగా వాహనాలు రాకపోకలకు కొనసాగించాలని వాహనదారులు కోరుతున్నారు.

హడలెత్తిస్తున్న చిరుతలు



రాంరాయనిపల్లి సమీపంలోని గుట్టను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

ఖిల్లాఘనపురం: వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని రాంరాయనిపల్లి (మల్కిమియాన్‌పల్లి) గ్రామ సమీపంలో చిరుతల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏకంగా రెండు చిరుతలు సంచరిస్తుండటంతో హడలెత్తిపోతున్నారు. రాంరాయనిపల్లి సమీపంలోని బోడగట్టు వద్దనున్న సందపురం వెంకట్‌రెడ్డి పశువుల పాక వద్ద శుక్రవారం ఉదయం రెండు చిరుతలు కనిపించాయి. విషయాన్ని గ్రామపెద్ద సాయిలు ఫారెస్ట్ అధికారులకు తెలియజేయడంతో సెక్షన్ ఆఫీసర్ భాస్కరాచారి, సిబ్బంది అంజనేయులు గుట్టపైకి వెళ్లి పరిశీలించారు. చిరుతల జాడ దొరక్కపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తీరా సాయంత్రం అదే గుట్టపై చిరుత కనిపించడంతో హీర్లతండాకు చెందిన కొందరు దూరం నుంచి వీడియో తీశారు. చిరుతల సంచారంతో రాంరాయనిపల్లితో పాటు హీర్లతండా, అల్లమాయపల్లి, వసురాంతండా, సూర్యతండా, దేవబండతండా, నేలబండతండా, అప్పారెడ్డిపల్లి తదితర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి చిరుతల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

దూడలపై చిరుత దాడి

నవాబుపేట: నవాబుపేట మండలంలోని యన్మన్‌గండ్ల శివారులో చిరుత సంచారం కలకలం రేపుతోంది. గురువారం సాయంత్రం గ్రామ శివారులోని గుట్ట పక్కనున్న పొలాల్లో రైతులు దూడలను కట్టేయగా.. అర్ధరాత్రి సమయంలో చిరుత దాడిచేసి గాయపర్చింది. శుక్రవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు.. రక్తపు మడుగులో ఉన్న దూడలను చూసి భయాందోళనకు గురయ్యారు. మొత్తం నాలుగు దూడలపై దాడి చేసినట్లు రైతులు తెలిపారు. చిరుత బారి నుంచి మూగజీవాలను కాపాడాలని కోరారు.

వరిలో నల్లిని నివారించుకుందాం

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్



నల్లి ఆశించడంతో ఆకుపై ఏర్పడిన తెల్ల మచ్చలు



వరి ఆకుపై ఆశించిన నల్లి పురుగు

అలంపూర్: వరి పంటను ఈ మధ్య కాలంలో ఆకునల్లి, కంకినల్లి ఆశిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచించారు. ఈ నల్లులు కంటికి కనపడకుండా ఉండే చిరుజీవులు. పరిస్థితులు అనుకూలించనప్పుడు ఉధృతిని పెంచుకుని వరి పంటను నష్టపరుస్తాయి. రైతులు నల్లిని నివారించుకోవడానికి ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ వివరించారు.

ఆకునల్లి

బూడిద తెలుపు రంగులో ఉండే నల్లి పురుగులు. ఆకుల వెనక భాగంలో, మధ్య ఈనల వెంబడి గుడ్లను పెడతాయి. ఒక్కొక్క ఆడ నల్లి 20–80 గుడ్లను పెడుతుంది. నాలుగైదు రోజుల్లో గుడ్ల నుంచి పిల్ల పురుగులు బయటికి వస్తాయి. వీటి జీవిత కాలం 9 నుంచి 13 రోజులు. ఈ నల్లి పురుగులు ఆకుల వెనక భాగం నుంచి రసాన్ని పీల్చివేయడంతో చిన్న చిన్న తెల్లటి మచ్చలు పొడవుగా కనిపిస్తాయి. వీటి ఉధృతి ఎక్కువైనప్పుడు తెల్ల మచ్చలన్నీ ఏకమై ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. దీంతో కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడుతుంది. మొక్కలు గిడసబారుతాయి.

నివారణ

ఈ నల్లి నివారణకు డైకోఫాల్ 5 మి.లీ. లీటరు నీటికి కలిపి ఆకుల అడుగు భాగంలో తడిచేలా పిచికారి చేయాలి.

కంకినల్లి

ఈ నల్లి తెలుపు రంగులో ఉంటుంది. గుంపులు, గుంపులుగా ఆకు తొడిమ పైభాగంలోని కణజాలంలో మధ్య ఈనెల కింద భాగంలోని కణజాలంలో చేరి రసాన్ని పీల్చి వేస్తాయి. తద్వారా మధ్య ఈనె నిలువుగా ఉదా రంగు చారలు తొడిమ మీద ఊదా రంగు మచ్చలు ఏర్పడతాయి. వీటి ఉధృతి పెరిగితే మచ్చల విస్తీర్ణం పెరుగుతుంది. కొన్ని సమయాల్లో ఆకులపై నుంచి రసాన్ని పీల్చేయడంతో ఆకులపై పసుపు రంగు చారలు ఏర్పడతాయి. వెన్ను అభివృద్ధి చెందే దశలో ఈ నల్లులు గింజలోకి చేరి అండాశయాన్ని, పుప్పొడిని ఆశించడంతో తాలుగా మారుతాయి. గింజలను వివిధ శిలీంద్రాలు ఆశించడంలో నల్లగా మారుతాయి. వీటి ఉధృతి ఎక్కువగా ఉంటే వెన్ను సరిగా బయటకు వెలువడదు. ఖరీఫ్ వరిపై దీని ప్రభావం ఎక్కువ. ఒక్కొక్క ఆడ నల్లి 50 గుడ్లను పెడుతుంది. జీవిత కాలం 6 నుంచి 10 రోజులు

నివారణ

ప్రొఫినోఫాస్ 2.మి.లీ., డైకోఫాల్ 5 మి.లీ, డైపెంథిరాన్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పంట 40–45 రోజుల మధ్యలో తప్పనిసరిగా పిచికారి చేసుకోవాలి.

నల్లులు ఆశించడానికి పరిస్థితులు

- అధిక తేమ, ఉష్ణోగ్రతలు
- మబ్బులతో కూడిన వాతావరణం
- అధిక నత్రజని వాడకం

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 14 తులాల బంగారం.. రూ.1.50 లక్షల నగదు అపహరణ

జడ్చర్ల: స్థానిక రంగారావు తోటలో శుక్రవారం తాళం వేసి ఇంట్లో చోరీ జరిగింది. సీఐ రమేశ్‌బాబు, బాధితుల కథనం మేరకు.. రంగారావు తోటలో నివాసం ఉంటున్న విభూష‌‌‌‌ణ్‌రెడ్డి గురువారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళ్లారు. కార్యక్రమం ముగించుకొని అదేరాత్రి 2.30 ప్రాంతంలో తిరిగి ఇంటికొచ్చారు. అప్పటికే ఇంటికి వేసిన తాళం విరిగి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా లాకర్‌లో దాచిన 14 తులాల బంగారు నగలు, రూ.1.50 లక్షల నగదు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ రమేశ్ బాబు ఘటన స్థలాన్ని పరిశీలించగా.. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

మరో ఇంట్లో..

జడ్చర్ల పట్టణంలోని బండమీది కిష్టారెడ్డి నగర్‌లోని రోడ్‌నంబర్–4లో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. బండమీది కిష్టారెడ్డి నగర్‌లోని రోడ్‌నంబర్–4లో నివాసముంటున్న లక్ష్మి, వెంకటేశ్వర్లు మంగళవారం ఇంటికి తాళంవేసి ఏపీలోని గుంటూరుకు వెళ్లారు. గమనించిన గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాన్ని పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. గురువారం చుట్టుపక్కల వారు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకున్నారు. బీరువాలో ఉన్న 4తులాల బంగారం ఆభరణాలతో పాటు మూడున్నర తులాల వెండి, రూ.40వేల నగదును చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

చిన్నారి అప్పగింత



మహబూబ్‌నగర్ క్రైం: తప్పిపోయిన మూడేళ్ల చిన్నారిని రైల్వే పోలీసులు ఆమె తండ్రికి అప్పగించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ అక్బర్ కథనం ప్రకారం.. హైదరాబాద్ ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన చిన్నారి ముంతాజ్‌ని బళ్లారికి చెందిన మల్లికార్జున్ గుంతకల్ రైలులో తీసుకెళ్తుండగా మహబూబ్‌నగర్ స్టేషన్‌లో పోలీసులు, ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. కిడ్నాప్ కేసు నమోదు కావడంతో చిన్నారిని ఆమె తండ్రి చెంతకు చేర్చారు. మల్లికార్జున్‌ను ఛత్రినాక పోలీసులకు అప్పగించారు.

నివాస గుడిసె దగ్ధం

- రూ.2 లక్షల ఆస్తి నష్టం



మంటల్లో కాలిపోతున్న గుడిసె

ఆత్మకూర్: షార్ట్‌సర్క్యూట్‌తో నివాస గుడిసెకు నిప్పంటుకుని దగ్ధమైన సంఘటనలో రూ.2 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. మండల పరిధిలోని వీరరాఘవపూర్‌కి చెందిన ఖాజ మహబూబ్‌అలీ మధ్యాహ్నం భార్యతో కలిసి సొంత పనిమీద ఆత్మకూర్‌కు వెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో గడిసెలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఇంట్లోని రెండు తులాల బంగారం, రూ.45 వేల నగదు, బియ్యం, దుస్తులు, ఇతర సామగ్రి మొత్తం కాలి బూడిదయ్యింది. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రేచింత శ్రీను కోరారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలి



రైతులను సన్మానిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

మరికల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టలతో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత లేకుండా పోయిందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. మరికల్ శ్రీవాణి పాఠశాలలో శుక్రవారం రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ప్రతిపంటకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేసినప్పుడే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. అలగే విద్యావ్యవస్థను గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. రెండు ప్రభుత్వాలు విద్యరంగంపై సవతి తల్లి ప్రేమను చూపాకుండా ఖాళీలను భర్తీ చేయలన్నారు. అలగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందడం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో యాజమాన్యం ఫీజులు చెల్లించాలని విద్యార్థుల కోసం కొంత మేరా సడలింపులు ఇచ్చి వారు ఉన్నత చదువులు చదివేందుకు సహాయ పడ్డాలన్నారు. అనంతరం రైతులను సన్మానించారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవచారీ, ఏట శివకుమార్, సర్పంచ్ గోవర్ధన్, కరస్పాడెంట్ వెంకటేశ్వర్లశర్మ, ఎంపీటీసీ గోపాల్, శ్రీనివాసశర్మ, శ్రీనివాసులు, రాములు, వినితమ్మ పాల్గొన్నారు.

మహిళలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న అరుణజ్యోతి

గద్వాల అర్బన్: మహిళలు అన్నిరంగాల్లో రాణించేందుకు కుటుంబసభ్యులు ప్రోత్సహించాలని ఐద్వా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, విశ్లేషకురాలు దేవి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని వాల్మీకి భవన్ ఆవరణలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో 'హక్కుల పరిరక్షణ–మహిళా సాధికారత'పై నిర్వహించిన సెమినార్‌కు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని మండిపడ్డారు. లింగ వివక్ష చూపకుండా స్త్రీ, పురుషులను సమానంగా ప్రోత్సహించాలని, విద్య, నైపుణ్యాన్ని ప్రోత్సాహిస్తే అన్నిరంగాల్లో శరవేగంగా ముందుకెళ్లే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా మహిళలు సైతం సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ముందుకుసాగాలంటే సమాన హక్కుల పరిరక్షణకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. సమావేశంలో గట్టు జెడ్పీటీసీ సభ్యురాలు బాసు శ్యామల, ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద, నాయకురాలు ఏమేలమ్మ, రజిత, పద్మ, రాములమ్మ, ప్రణీత, లలిత, పూర్ణిమ తదితరులు ఉన్నారు.

గేదెను తప్పించబోయి ఆర్టీసీ బస్సు బోల్తా

- తప్పిన పెనుప్రమాదం



కనిమెట్ట వద్ద బోల్తా పడిన ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు

కొత్తకోట రూరల్: గేదెను తప్పించబోయి ఆర్టీసీ బస్సు బోల్తా పడిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట జాతీయ రహదారి 44పై చోటుచేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా ఆలగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం రాత్రి 21 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. శుక్రవారం తెల్లవారుజామున కనిమెట్ట సమీపంలోకి రాగానే బస్సుకు గేదే అడ్డం రావడంతో బస్సు డ్రైవర్ గురుదేవ్ గేదెను తప్పించబోగా బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. బస్సు తక్కువ వేగంతో ఉండటంతో బస్సులోని ప్రయాణికులు సురక్షింతంగా బయటపడ్డారు. ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యాన కళాశాల మోజర్లకు తరలింపు

కొల్లాపూర్: స్థానిక ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలను వనపర్తి జిల్లా మోజర్ల ఉద్యాన కళాశాలకు తరలించారు. రెండ్రోజుల క్రితమే కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన యూనివర్సిటీ రిజిస్ట్రార్ భగవాన్ నుంచి కళాశాల తరలింపునకు సంబంధించిన ఉత్తర్వులు చేరడంతో వెంటనే ప్రక్రియ చేపట్టారు. శనివారం నుంచి మోజర్ల ఉద్యాన కళాశాలలో తరగతులు కూడా ప్రారంభమవుతాయని వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో కొల్లాపూర్‌కు ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. సెప్టెంబర్ 16 నుంచి ఆర్‌ఐడీ ప్రభుత్వ పాఠశాలలో లాంఛనంగా తరగతులు ప్రారంభించారు. కళాశాలకు సొంత భవనం, ఇతర వసతుల కోసం రూ.54 కోట్లు మంజూరు చేసింది. కానీ స్థల సేకరణ, భవన నిర్మాణ పనులు, సిబ్బంది నియామకం తదితర ప్రక్రియలు ప్రారంభం కాలేదు. మొత్తం 14 మంది సిబ్బంది అవసరం ఉండగా.. వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఏడాది కౌన్సిలింగ్ ద్వారా 8 మంది విద్యార్థులు కొల్లాపూర్ కళాశాలలో చేరారు. వీరికి రెండు సెమిస్టర్ల పరీక్షలు ముగిశాయి. ఇక నుంచి క్షేత్ర పర్యటనలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందు కోసం విద్యార్థులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో యూనివర్సిటీ అధికారులు తాత్కాలికంగా మోజర్లకు తరలించాలని ఉత్తర్వులు జారీచేశారు. కొల్లాపూర్‌లో అన్ని సౌకర్యాలు కల్పించిన తర్వాత తిరిగి మార్చుతారని రాజశేఖర్ వెల్లడించారు. కళాశాలలోని ఫర్నీచర్, రికార్డులను ఇప్పటికే తరలించామని వివరించారు.

రెండు లారీల బియ్యం పట్టివేత



లారీల్లో బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దూరు: మద్దూరులోని రెండు రైస్‌మిల్లుల నుంచి లారీల్లో ఎఫ్‌సీఐకి తరలిస్తున్న క్రమంలో జిల్లా టాక్స్‌ఫోర్స్ పోలీసులు గురువారం సాయంత్రం లారీలను పట్టుకుని మద్దూరు పోలీస్‌స్టేసన్‌కు తరలించారు. ఇందులో రేషన్‌బియ్యం ఉన్నట్లు సమాచారం మేరకు టాక్స్‌ఫోర్స్ పోలీసులు అనుమానించడంతో శుక్రవారం జిల్లా పౌరసరఫరాల అధికారులు నారాయణ, ఎల్లయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అనంద్ బియ్యంను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాత చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ లారీలు అన్నపూర్ణ రైస్‌మిల్లు, భవాని రైస్‌మిల్లుల నుంచి వచ్చినట్లు, ఇందులో 58 టన్నుల బియ్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.